క్లుప్తంగా

సామూహిక రుద్రపూజ



రుద్రపూజ నిర్వహిస్తున్న స్వామిజీలు

కలసపాడు : స్థానిక శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సామూహిక రుద్రపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిచరణానంద మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఐక్యంగా ఉండాలని, ఏ కార్యక్రమం చేయాలన్నా మనస్సు నిశ్చలస్థితిలో ఉండాలన్నారు. లేనిపక్షంలో ఏ పని చేయలేరన్నారు. శివనామస్మరణ చేయడంతో మనస్సు శాంతిస్తుందన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌బీ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సైనికులు

ప్రొద్దుటూరు క్రైం : తమకు ఇంటి స్థలం మజూరు చేయాలని కోరుతూ మాజీ సైనికులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి గురువారం వినతిపత్రం అందచేశారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలవీరారెడ్డి, ఇతర సభ్యులు మాట్లాడుతూ మాజీ సైనికుల కోసం కార్యాలయం, అమర్ జవాన్ నిర్మాణంకోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మైదుకూరు : ప్రగతి విద్యా జ్యోతి స్కాలర్ షిప్ పథకం కింద గురువారం మైదుకూరులోని బాలశివ బాలికల హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వారు ఆర్థిక సహాయాన్ని అందించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మదన్‌మోహన్‌రెడ్డి పాఠశాలకు చెందిన విద్యార్థులు పవిత్ర, చైతన్య లక్ష్మీ, తనూజలకు రూ.5వేలు చొప్పున స్కాలర్ షిప్ అందజేశారు. బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ స్కాలర్ షిప్‌లను అందజేసినట్టు బ్యాంకు మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయుడు జీసీ సిద్ధయ్య పాల్గొన్నారు.

వంకమర్రి వద్ద లారీ బోల్తా

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల – మైదుకూరు ప్రధాన రహదారిలో గురువారం ఉదయం లోడుతో వెళుతున్న ఐషర్ లారీ వంకమర్రి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. పోరుమామిళ్ల వైపు నుండి మైదుకూరు వైపు వెళుతుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఐషర్ బండి వెనుక ఉన్న పై భాగం విడిపోయి రోడ్డుకు బోల్తా పడింది. ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

పంట నమోదు తప్పనిసరి

బి.కోడూరు : మండలంలోని రైతులు తాము సాగే చేసిన పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి టి.కౌశిక తెలిపారు. గురువారం మండలంలోని ఐత్రంపేట, మున్నెల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో రబీలో సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీలో ప్రతి రైతు సాగు చేసిన ప్రతి పంటను రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలన్నారు.

కంటి సమస్యను అశ్రద్ధ చేయొద్దు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న రఘురామిరెడ్డి

రాజుపాళెం : విద్యార్థులు కంటి సమస్యలను అశ్రద్ధ చేయకూడదని కంటి వైద్యుడు రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని వెలవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు హాజీ రహంతుల్లా మాట్లాడుతూ 136 మందికి వైద్య పరీక్షలు చేయగా అందులో 8 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో రఘురామిరెడ్డి, కంటి వైద్యుడు తేజ, ఏఎన్ఎం స్వరూప, సరళ, నిర్మల పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

బద్వేలు అర్బన్ : పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం బాలాయపల్లె, కోనసముద్రం ఆర్సీఎం ప్రాథమిక పాఠశాల, నందిపల్లెలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో చదువుతున్న 300 మంది విద్యార్థినీ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎల్.ప్రసాద్‌రెడ్డి, జీ.శ్రీకాంత్‌రెడ్డిలు ఉచితంగా పంపిణీ చేశారు.

విప్లవ పితామహుడు పూలే

పోరుమామిళ్ల : దేశ సాంఘిక విప్లవ పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పోరుమామిళ్లలో వేర్వేరుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రమణారెడ్డి, మానవ హక్కుల వేదిక నేత ఫణిరావు, నాయకులు పాల్గొన్నారు.

సర్వే సరే.. సమస్యలు తీరేదెన్నడు?

- రీ సర్వేతో రైతన్నలకు కొత్త కష్టాలు
- ఆన్‌లైన్‌లో మార్పులు చేర్పులు లేక ఇబ్బందులు



రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అర్జీలు తీసుకుంటున్న అధికారులు (ఫైల్)

ఖాజీపేట : వంద సంవత్సరాల తరువాత వాస్తవ భూములపై సమగ్ర భూ సర్వే ప్రభుత్వం చేయించింది. అయితే రీ సర్వే చేసే సమయంలో వచ్చిన సమస్యలతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరికి ఆన్‌లైన్ నమోదులు లేక, మరికొందరికి ఒన్‌బీ రాక మరికొందరికి భూ నమోదులో వచ్చిన తేడాలతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టు రైతన్నలు ప్రదక్షణలు చేస్తున్నా వారి సమస్యలు పరిష్కారంకు నోచుకోవడం లేదు.

రీ సర్వేతో వచ్చిన సమస్యలు

ఖాజీపేట మండలంలో 21 పంచాయతీలు ఉండగా అందులో 17 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అందులో 4 రెవెన్యూ గ్రామాలైన మిడుతూరు, తుడుమలదిన్నె, చెమ్ముళ్ళపల్లె, బుడ్డాయపల్లెల్లో రీ సర్వే చేయించింది. అయితే రీ సర్వే చేసే సమయంలో గ్రామాల్లో ఇంటి వద్ద రైతులు లేక పోవడం సరైన పత్రాలు చూపించక పోవడం ఇలా అనేక కారణాల వల్ల నమోదు ప్రక్రియ ఆలస్యంగా పూర్తి అయ్యింది. దీంతో కొందరు భూములు ఉన్న భూముల కంటే తక్కువగా, మరికొందరికి అదనంగా వారి ఖాతాలో చేరడం జరిగింది. దీంతో నమోదు వల్ల వచ్చిన సమస్యల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. రెవెన్యూ అధికారుల చుట్టు తిరుగుతున్నారు.

పట్టా భూములకు ఇబ్బందులే

రీ సర్వే చేసిన గ్రామాల్లో ప్రభుత్వం మార్పులు చేర్పులను ప్రభుత్వం పూర్తిగా నిలిపి వేసింది. దీంతో కొత్తగా వచ్చిన ప్రభుత్వం మార్పులు చేర్పులకు అవకాశం నేటికి ఇవ్వలేదు. దీంతో సమస్యలు వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందులో పట్టా భూముల్లో వచ్చిన సమస్యలు పరిష్కారం కావడంలో కొందరి రైతులకు వన్‌బీ రావడంలేదు. మరి కొందరి భూములు ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. దీంతో అమ్మకాలు చేసుకోవాలన్న లేక కొనుగోలు చేసుకోవాలన్న రిజిస్టర్ కావడం లేదు. కొనుగోలు చేసే రైతులు అమ్ముతున్న రైతుల పై ఒత్తిడి చేస్తున్నారు. అలాగే బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలన్న సమస్యలు వస్తున్నాయి.

ఆన్‌లైన్ నమోదు ఎప్పటికి?

రీ సర్వే చేసిన సమయంలో ప్రభుత్వం ఆన్‌లైన్‌లో మార్పులు చేర్పులు నిలుపుదల పూర్తిగా నిలిపి వేసింది. నమోదుకు అవకాశం ఎప్పటికి కల్పిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అలాగే డీకేటీ పట్టాలు, సీలింగ్ భూములు, ఇనాం భూములు, ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. వీరందరికి వన్‌బీలు రావడం లేదు. దీంతో వీరందరూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యలయం చుట్టు తిరుగుతున్నారు. కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఇది ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన నిర్ణయం కారణంగా మా చేతుల్లో ఏమీ లేదు అంటూ రైతులకు అధికారులు చెబుతున్నారు. దీంతో వీరందరికి బ్యాంకు రుణాల్లో అలాగే భూమి కొలతల్లో వచ్చిన మార్పుల సమరణలు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

రీ సర్వే చేసిన గ్రామాలు		
రెవెన్యూ గ్రామం	ఎకరాలు	వచ్చిన అర్జీలు
మిడుతూరు	2750.22	50
తుడుమలదిన్నె	1900.06	68
చెమ్ముళ్ళపల్లె	3614.72	32
బుడ్డాయపల్లె	418.47	13

రెవెన్యూ సదస్సులతో సరి...

రీ సర్వే చేసిన గ్రామాల్లో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఈ సందర్భంగా మిడుతూరులో 50, తుడుమలదిన్నెలో 68, బుడ్డాయపల్లెలో 13, చెమ్ముళ్ళపల్లెలో 32 మంది రైతులు అర్జీల రూపంలో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. అయితే సదస్సులు నిర్వహించినా ఎలాంటి సమస్యలు పరిష్కారం జరగడం లేదని రైతులు అంటున్నారు. అర్జీల పై వెంటనే అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

భూ సమస్య పరిష్కారం కావడం లేదు



నాకు 2.68 సెంట్లు స్థలం ఉంది. అయితే 2.47 సెంట్లు మాత్రమే చూపిస్తోంది. 0.21 సెంటు తక్కువ వచ్చింది. అయితే మా గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో సమస్య పరిష్కారం కోసం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చాను నేటికి సమస్య పరిష్కారం జరగలేదు.

– ఈశ్వర్‌రెడ్డి, రైతు, తుడుమలదిన్నె

అర్జీల సమస్యలను పరిష్కరిస్తున్నాం



రెవెన్యూ గ్రామ సదస్సుల్లో వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక టీం పనిచేస్తోంది. కొంత మంది రైతుల సమస్యలు పరిష్కరించాం. అలాగే మిగిలిన సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆన్‌లైన్ నమోదు అనేది ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలి.. త్వరలో అన్ని రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయి.. వాటి తరువాత ఉన్నతాధికారులు అనుమతులు రావచ్చునని భావిస్తున్నాను. వచ్చిన వెంటనే అన్ని భూ సమస్యలు పరిష్కారం అవుతాయి.

– డి.మహబూబ్‌బాషా, తాహసీల్దార్

విద్యుత్ భారాన్ని మోపొద్దు

పోరుమామిళ్ల : ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీని మరచి ప్రభుత్వంలోకి రాగానే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసగించిందని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపొద్దని గురువారం పోరుమామిళ్ల ట్రాన్స్‌కో ఏడీఏ రవిచంద్రకు సీపీఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలపై ట్రూ అప్ చార్జీల పేరుతో రూ. 6,072 కోట్ల భారాన్ని వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ఉద్యమం తప్పదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వమే ఆ భారాన్ని భరించాలన్నారు. కార్యక్రమంలో కేశవ, చెన్నయ్య, పేరయ్య, శ్రీనివాసులు, సఫా, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సులతో ఉపాధి అవకాశాలు

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని 9, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా వృత్తి విద్య నైపుణ్యంపై గురువారం అవగాహన కల్పించినట్లు ప్రత్యేకాధికారి రెడ్డిజ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీ అండ్ ఐటీఈఎస్ కోర్సు ద్వారా విద్యార్థులకు ఉన్నత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని, వృత్తివిద్య నైపుణ్యం కోర్సుల మీద అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వృత్తివిద్య ఉపాధ్యాయురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవమూర్తి జ్యోతిరావు పూలే



బద్వేలు అర్బన్: పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : సమాజంలో మార్పు కోసం కృషి చేసిన సామాజిక విప్లవమూర్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక సిద్దవటం రోడ్డులోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం పాఠశాలలను ప్రారంభించి వారికి విద్యా బుద్ధులు నేర్పించిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని అన్నారు. అంతేకాకుండా వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం పూలే ఎంతో కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, అంతేకాకుండా నామినేటెడ్ పదవుల్లో, రాజ్యసభ పదవుల్లోనూ బీసీలకు అవకాశం కల్పించారన్నారు. నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పేదలకు సంక్షేమాన్ని దూరం చేసిందని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షులు బంగారు శీనయ్య, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా శ్రీరాములు, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు అనిల్‌కుమార్, నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, మౌలాలి, కేశవరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, రజనీకాంత్, సుబ్బరాజు, సాంబశివారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయసాధనకు కృషిచేద్దాం

బద్వేలు అర్బన్ : ఉద్యమకారుడు, సంఘ సేవకుడు మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పూలే ఆశయసాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా గురువారం మహనీయుల ఆశయసాధన కమిటీ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. వజ్రాల వెంకటస్వామి, ఎం.శ్రీనివాసులు, చెన్నయ్య, శ్రీనివాసులరెడ్డి, అన్వర్‌బాషా, ఓ.ఎస్.వి.ప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

• కమనీయం కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అమృతేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. వేకువజామున అమృతేశ్వరస్వామికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తి పీఠాలకు విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మృతేశ్వర స్వామి, పార్వతీదేవి ఉత్సవ విగ్రహాలకు వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. స్వామి అయ్యప్పసేవా సంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి, సెక్రటరీ నామా వాసు, జాయింట్ సెక్రటరీ కళాసాగర్, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతి ప్రసాద్, రఘువంశీ, కిరణ్, శ్రీధర్, పీఆర్ఓ ధారా సంతోష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్‌తో ఆదాయం



మాట్లాడుతున్న ఈఈ భరణీకృష్ణ

పోరుమామిళ్ల : విద్యుత్ గృహ వినియోగదారులు ఇంటిపై సోలార్ బిగించుకోవడం వల్ల విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గించుకోవచ్చని మైదుకూరు డివిజన్ ఈఈ భరణీకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో జరిగిన ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన సమావేశంలో సోలార్ రూఫ్ టాప్ గురించి వివరించారు. ఆసక్తి ఉన్నవారు పేర్లు రిజిస్టర్ చేయించుకుంటే రాయితీ లభిస్తుందన్నారు. 1 కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల వరకు మీ వినియోగాన్ని బట్టి సోలార్ రూఫ్ బిగించుకోవచ్చన్నారు. తక్కువ వడ్డీకి బ్యాంకులు రుణం ఇస్తాయన్నారు. సమావేశంలో పాల్గొన్న యరసాలకు చెందిన యువకుడు భాస్కర్‌రెడ్డి 1 కిలోవాట్ బిగించుకునే వంద మంది వినియోగదారులకు 10 శాతం సబ్సిడీ భరిస్తానన్నారు. ఈ సమావేశంలో ఏడీఏ రవిచంద్ర, ఏఈఈ వెంకటమహేష్, నెడ్ క్యాప్ ఇంజనీర్ యల్లారెడ్డి, నాలుగు మండలాల ఏఈలు, వినియోగదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లాపై కూటమి ప్రభుత్వం వివక్ష

- జిల్లాలోని ప్రాజెక్టులకు, ఉక్కు ఫ్యాక్టరీకి బడ్జెట్‌లో కేటాయింపులు సున్నా
- సీపీఎం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్



మాట్లాడుతున్న చంద్రశేఖర్

పోరుమామిళ్ల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజా వ్యతిరేక విధానాలతో ముందుకుపోతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో గౌసియాబేగం అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల 2వ మహాసభలో ఆయన మాట్లాడుతూ టీడీపీ మద్దతుతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా గ్రాంటుగా ఇవ్వలేదన్నారు. వెలిగొండ పూర్తికి రూ. 800 కోట్లు అవసరమని, వామికొండ, సర్వరాయసాగర్ నిర్మాణాలకు రూ.1000 కోట్లు అవసరం ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సర బడ్జెట్లో ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీకి మంజూరైన 50 ఎంబీబీఎస్ సీట్లను రద్దు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదని ఆయన విమర్శించారు. గతంలో కడప ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసిన చంద్రబాబునాయుడు ఈ బడ్జెట్‌లో రూపాయి కేటాయించలేదన్నారు. వైఎస్సార్ జిల్లా పట్ల కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతున్నారన్నారు. వివక్ష విధానాలు విరమించి, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సభకు ముందు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేద్కర్ భవన్ వరకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, రామ్మోహన్, మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు పని ఒత్తిడి తగ్గించాలి



ఎంపీడీఓ వీరకిశోర్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

చాపాడు : వివిధ రకాల సర్వేలు, యాప్‌ల పేరుతో అదనపు పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ వీరకిశోర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ సాధారణ విధులతోపాటు సచివాలయ నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్నారన్నారు. సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ప్రజలను సమన్వయంతో ముందుకు నడపడంలో పంచాయతీ కార్యదర్శుల బాధ్యత ఎక్కువగా ఉందన్నారు. గ్రామ పంచాయతీలలో ఏ సమస్య వచ్చినా ముందు ఉండాల్సి వస్తుందన్నారు. కొన్ని కార్యక్రమాలకు సొంత డబ్బును ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం జీఎస్‌డబ్ల్యూఎస్, వీఎస్‌డబ్ల్యూఎస్, పీజీఆర్ఎస్, ఓడీఎఫ్, ఈగ్రామ స్వరాజ్, స్వర్ణ పంచాయతీ వంటి సర్వేలు చేయిస్తూ బాధ్యత పెంచిందన్నారు. పెన్షన్ల పంపిణీ, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో అదనపు భారం మోపుతుందన్నారు. గ్రామ పంచాయతీల రిపోర్టులు చేయడంలో ఆలస్యం అయితే ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికాక తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మైదుకూరు : సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులపై అప్రమత్తంగా ఉండాలని వక్తలు తెలిపారు. గురువారం సైబర్ నేరాలు బెదిరింపులపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జ్వాలా నరసింహా శర్మ, హెడ్ కానిస్టేబుల్ శేషగిరిరావు మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలో ప్రముఖ వ్యక్తులు సైబర్ నేరాల పట్ల నిర్లక్ష్యంగా ఉండటం వల్లే పెద్ద మొత్తంలో డబ్బును పోగొట్టుకోవడం జరుగుతోందన్నారు. ఏమైనా అనుకోని సైబర్‌నేరాలు జరిగినప్పుడు తక్షణమే పోలీస్ శాఖ వారిని సంప్రదించాలని, పోలీస్ వారి సూచనలు, సహాయ సహకారాలు ఎలా ఉంటాయో విద్యార్థులకు క్షుణ్ణంగా తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ నాణ్యత పరీక్ష కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

అట్లూరు : బద్వేలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని ఇంటిగ్రేటెడ్ నాణ్యత పరీక్ష కేంద్రాన్ని గురువారం బద్వేలు సహాయ వ్యవసాయ సంచాకులు ఎం.నాగరాజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, పరికరాల వినియోగం, ఎరువులు, విత్తనాలు, నాణ్యత పరీక్ష విధానం, లక్ష్యాలు, ప్రగతిపై సమీక్షించారు. రైతుల నుండి సేవా నమూనాల సేకరణ, విశ్లేషణ సామర్థ్యం, లక్ష్యాలు గురించి ఆరా తీశారు. రైతులు వారి విత్తనాలు, ఎరువులు ఉచితంగా వినియోగానికి ముందు పరీక్షించి వాడుకుంటే అనవసర ఖర్చు, శ్రమ తగ్గుతుందని తెలిపారు. కావున రైతులు ఈ నాణ్యత పరీక్ష కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బద్వేలు ఏడీఏ కార్యాలయంలో కౌలు రైతుల ముసాయిదా చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించి రైతుల సలహాలు, సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి బి.మాధురి, వ్యవసాయ విస్తరణాధికారులు జి.అరుణ, రవీంద్రారెడ్డి, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ



చిన్నారిని పరీక్షిస్తున్న తీరును తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

మైదుకూరు : పట్టణంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు పరిశీలించారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం కింద పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం తెలుగుగంగ కాలనీలోని కస్తూర్బా పాఠశాలను డీఎంహెచ్‌ఓ సందర్శించారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సమస్యలపై వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పాఠశాలలోని వంటశాలను, పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బద్వేలు డివిజన్ వైద్యాధికారి డాక్టర్ మల్లేష్, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సుమధుర తదితరులు పాల్గొన్నారు.

జన ఔషధ కేంద్రం ప్రారంభం

కడప అగ్రికల్చర్: ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం ద్వారా ప్రజలకు నాణ్యమైన మందులు లభిస్తాయని జిల్లా సహకార అధికారి జి.సుభాషిణి పేర్కొన్నారు. కడప నగరం నాగరాజుపేటలోని జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం కమర్షియల్ కాంప్లెక్స్ రూమ్ నెంబర్-22లో గురువారం జన ఔషధ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సుభాషిణి మాట్లాడుతూ జన ఔషధ కేంద్రంలో తక్కువ ధరకే మందులు లభిస్తాయన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి



వెంగయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మడకలవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టిబోయిన వెంగయ్య అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వెంగయ్య మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. పార్టీపరంగా వెంగయ్య కుటుంబ సభ్యులకు అన్ని విధాల అండగా ఉంటామని తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సుందర్‌రామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, పుత్తా శ్రీరాములు, రఘురామిరెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

మల్లయ్య మృతికి పలువురు సానుభూతి

బి.కోడూరు : మండలంలోని పాయలకుంట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్, సీనియర్ నాయకులు బొమ్మన మల్లయ్య (55) గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై గురువారం మృతిచెందాడు. ఈయన మృతి పట్ల ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు యోగానందరెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, చెన్నమ్మ, జెడ్పీటీసీ దావీదులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అరిగెపూడి మృతి తీరనిలోటు

గోపవరం : సమాజ సేవకుడు అరిగెపూడి విజయకుమార్ మృతి తీరని లోటని మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరిగెపూడి ఫౌండేషన్, ఎన్‌జీఓ నెట్‌వర్క్ వ్యవస్థాపకులుగా నవ్యాంధ్ర రచయితల సంఘం గౌరవ సలహాదారులుగా రూ.100 కోట్లను సమాజ సేవకు దానం చేసిన మహోన్నతుడు అని కొనియాడారు. వెనుకబడిన ప్రాంతాల్లో 17 పాఠశాలలు, రెండు వైద్యశాలల నిర్మాతగా తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందారన్నారు. విజయకుమార్ ఆత్మశాంతికి మౌనం పాటించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.